క్లుప్తంగా

పాలకోడేరులో కేంద్ర బృందం పర్యటన



పాలకోడేరులో పరిసరాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పాలకోడేరు: మండలంలోని కుముదవల్లి, పాలకోడేరు గ్రామాల్లో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కేంద్రం బృందం పర్యటించింది. గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడి కేంద్రాలు, పాఠశాలలు, సందర్శించి మరుగుదొడ్లు, పారిశుధ్యం నిర్వహణ పై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నూకల మురళి గంగాధరరావు, ఇంచార్జ్ ఈవోపీఆర్డీ దొంగ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు సీహెచ్ వెంకటరమాలీల, పెన్మత్స శ్రీవిద్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు ఉన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి

సాక్షి, భీమవరం: తెలుగుభాష తరతరాల చరిత్ర కలిగిందని భాషా ఔన్నత్యాన్ని తెలుసుకుని ప్రతి ఒక్కరూ భాషాభివృద్ధికి కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భీమవరం డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డి శ్రీరామ్ అన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని శనివారం భీమవరం ఎస్‌సీహెచ్ బీఆర్ఎమ్ స్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, సామెతలు, కథలు, కవితలు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 28న పొట్టి శ్రీరాములు మునిసిపల్ గరల్స్ స్కూల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని శ్రీరామ్ చెప్పారు. ఈ పోటీలకు తెన్నేటి మాస్టారు, ఆర్.తులసీప్రదీప్, నాగేశ్వరరావు, భాస్కర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని అన్నారు.

దేశ వ్యాప్త నిరసనలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్

ఆకివీడు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్త ఆందోళనలు చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పట్టణ కార్యదర్శి పెంకి అప్పారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద, 4న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెవిస్వీ. గోపాలన్, కె.తవిటినాయుడు, బొడ్డుపల్లి రాంబాబు, డోకల రవితేజ, గోపిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సాక్షి, భీమవరం: స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడి చేశారు. భీమవరం రూరల్ మండలం చినఅమిరం గ్రామంలో శనివారం కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి నలుగుర్ని అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.11,770 నగదు, కోడి పుంజును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి శ్రీనివాస్ తెలిపారు.

సత్రం భూములకు వేలం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని మన్యం జగ్గమ్మగారి సత్రానికి సంబంధించి పూలపల్లిలో ఉన్న 16.50 ఎకరాల చేపల చెరువులకు శనివారం టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించారు. గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు మొదటి సంవత్సరానికి రూ.9,75,000, రెండో ఏడాది 10 శాతం పెంపుతో రూ.10,72,500, మూడోసంవత్సరం రూ.11,79,750లకు పాడుకున్నారు. పాత మక్తా రూ.6,12,000 ఉంది.

షాపులకు వేలం

సత్రానికి సంబంధించి నాలుగు షాపులకు నిర్వహించిన వేలం పాటలో నెలకి ఒక్కొక్క షాపునకు రూ.12,600కి హెచ్చు పాటకి పాడుకున్నారు. పాత అద్దె నెలకి రూ.10,500 ఉంది. దేవదాయ శాఖ (భీమవరం) తనిఖీ అధికారి వి.వెంకటేశ్వరరావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ నంబూరు శ్రీగంగా పవన్‌కుమార్, ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, ట్రస్టీలు కడలి రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

పెనుమంట్ర: ధ్యానంతో మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవచ్చని పిరమిడ్ ధ్యాన కేంద్రం సైంటిస్ట్ నాగేశ్వరరావు అన్నారు. బ్రహ్మర్షి పితామహ పత్రీజీ టిబెట్ మహాయోగి మిలారేపా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పెనుమంట్ర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మూడు రోజుల మౌనధ్యాన కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. మాటలకు ఆటుపోటులు ఉంటాయని, మౌనం నిర్మలంగా నిదానంగా నిలకడగా ప్రవహించే జ్ఞాన స్రవంతి అని, దీనిని అనుసరిస్తే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలుగుతామని నాగేశ్వరరావు అన్నారు. ఈసందర్భంగా పలువురికి మౌనధ్యానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, పిరమిడ్ ధ్యాన కేంద్ర సభ్యులు, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన శిక్షణా కేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



అర్బన్ పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని 24వ వార్డులో రూ.90 లక్షల నిధులతో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా 19, 20, 21, 22, 23, 24, 25, 26, 27 వార్డుల ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులో ఉంటాయని అన్నారు. 60 రకాల రక్త పరీక్షలు ఈ కేంద్రంలో నిర్వహిస్తారని అన్నారు. ఓపీ సేవలతో పాటుగా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు, క్షయ, లెప్రసీ, ఎయిడ్స్‌కు వైద్య సేవలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత కల్పించారని అన్నారు. ముఖ్యంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 3,500కి పైగానే వ్యాధులకు కార్పొరేట్ ఆసుపత్రిలలో ఉచితంగా వైద్యాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. అయితే ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లినపుడు తమకు అవసరమైన వైద్యసేవలు ఆరోగ్య శ్రీ పథకంలో ఆ ఆసుపత్రిలో ఉన్నాయో లేదో ఖచ్చితంగా తెలుసుకోవాలని సూచించారు.

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వేగవంతం

భీమవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, రెండు మూడు రోజుల్లో శ్లాబ్ వేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. ఈ 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి తమ కుటుంబం తరఫున నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మొదటి విడతగా మంజూరైన రూ.10.15 కోట్ల నిధులతో ప్రస్తుతం ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని, మరో రూ.30 కోట్ల నిధుల కోసం నాబార్డుకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. త్వరలోనే ఈ నిధులు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, పార్టీ నాయకులు లక్కు త్రిమూర్తులు, కొప్పుల సత్తిబాబు, రామాయణం సత్యనారాయణ, కొప్పుల రంగారావు, కామన నాగేశ్వరరావు, గంటా సుందర్‌కుమార్, పాలపర్తి జోనా, భలే ఏసుబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, ఏఎస్ రాజు, మందారపు శ్యాంసుందర్, కొట్టి కుటుంబ రావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ప్రతిపాదిత స్థల పరిశీలన

పాలకోడేరు : శృంగవృక్షం గ్రామంలో డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత స్థలాన్ని శనివారం తహసీల్దార్ షేక్ హుస్సేన్ పరిశీలించారు. గ్రామానికి డంపింగ్ యార్డ్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, స్థలాన్ని కేటాయించాలని కోరుతూ గ్రామాభివృద్ధి కమిటీ హైకోర్ట్‌ను ఆశ్రయించడంతో ఆరు వారాల్లోగా తగు చర్యలు తీసుకోవాలని కోర్టు రెవెన్యూ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు తహసీల్దార్ షేక్ హుస్సేన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం నాయుడు, మండల సర్వేయర్ శ్రీనివాస్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. వీరి వెంట సచివాలయం సర్వేయర్ కార్తీక్, బంటుమిల్లి వీఆర్వో అలివేలు మంగతాయారు, సచివాలయం కార్యదర్శి దిలీప్ కుమార్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా



ఉండి : పీహెచ్‌సీ వద్ద రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు



పాలకోడేరు : విస్సాకోడేరు సెయింట్ జోన్స్ హైస్కూల్లో మదర్ థెరిస్సాకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం



భీమవరం : మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆకివీడు : స్థానిక సీహెచ్‌సీ వద్ద మదర్ థెరిస్సాకు నివాళులర్పిస్తున్న జక్కీ తదితరులు

ఉండి : మానవసేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా అని ఉండి లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు వేగేశ్న అనంత లక్ష్మి అన్నారు. శనివారం ఉండి పీహెచ్‌సీ వద్ద మదర్ థెరిస్సా జయంతిని క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పీహెచ్‌సీ వద్ద ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రపంచంలో సేవకు అర్థం చెప్పి అనేక మందిని సేవ చేసేలా ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి మదర్ థెరిస్సా అని కొనియాడారు. క్లబ్ ప్రతినిధులు గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకుని లయన్స్ క్లబ్ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. అనంతరం రోగులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

విస్సాకోడేరు సెయింట్ జోన్స్ హైస్కూల్‌లో...

పాలకోడేరు : మదర్ థెరిస్సా 113వ జయంతి విస్సాకోడేరు గ్రామంలోని సెయింట్ జోన్స్ హైస్కూల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్కూల్ హెడ్మాస్టర్ డాక్టర్ స్వర్ణలత మదర్ థెరిస్సా సేవాగుణాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు.

సాక్షి, భీమవరం : స్థానిక డీఎన్నార్ కళాశాలలో మదర్ థెరిస్సా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ శాంత కుమారి థెరిస్సా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పేదలకోసం ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి గౌతమ్‌కుమార్, చెల్లబోయిన రంగారావు, టి చిట్టిబాబు, ఎ.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

థెరిస్సా సేవలు వెలకట్టలేనివి

ఆకివీడు: మదర్ థెరిస్సా సేవలు వెలకట్టలేనివని, ఆమె సేవల్ని కొనసాగించే విధంగా ప్రతీ ఒక్కరూ ముందుకు వెళ్లాలని అంబటి రమేష్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ పిలుపునిచ్చారు. లయన్స్ అభయ క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమం స్థానిక సీహెచ్‌సీలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభాగ్యులను ఆదుకోవడం, అనార్థులకు సేవలందించడం, మానవతా విలువల్ని పెంపొందించడం వంటి కార్యక్రమాల ద్వారా థెరిస్సా ఆశయ సాధనల్ని తమ సంస్థ ద్వారా నిర్వహిస్తున్నామని చెప్పారు. తోట భుజంగరావు, కందుల అప్పారావు, మణికంఠ, బండారు వెంకటరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.

ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు



రోడ్డు ఆక్రమణలపై సూచనలిస్తున్న సీఐ సత్యనారాయణ, కమిషనర్ కృష్ణమోహన్

ఆకివీడు: రోడ్డు మార్జిన్ల ఆక్రమణల్ని తొలగించాలని, వ్యాపారస్తులు రోడ్లపైకి వచ్చి సామాన్లు ఉంచడం సరికాదని నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్ హెచ్చరించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణపై రూరల్ సీఐ సత్యనారాయణ, కమిషనర్ శనివారం పర్యటించి ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. కూరగాయల వ్యాపారులు రోడ్లపైకి వచ్చి విక్రయిస్తున్నారని, చిరు వ్యాపారులు కూడా రోడ్డు మార్జిన్ల ఆక్రమణలో ఉన్నారని చెప్పారు. ఆక్రమణల్ని ఖాళీ చేయడం, రోడ్లపైకి వచ్చిన దుఖాణదారులు లోపలికి సామాన్లు సర్దుకోవాలని హెచ్చరించారు. రెండు మూడు సార్లు ఈ విధంగా తెలియజేస్తామని, అప్పటికీ వారిలో మార్పు రాకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలని రూరల్ సీఐ సత్యనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్సై ఫణి మోహన్ , పోలీస్ సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



వేంపాడు ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

కాళ్ల: పాఠశాలలు అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని వేంపాడు సర్పంచ్ యిర్రింకి పద్మావతి అన్నారు. కాళ్ళ మండలం వేంపాడు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) ఆవరణలో దాత వేగేశ్న కృష్ణంరాజు(అభిరుచి) సహకారంతో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేశారు. శనివారం సరస్వతీదేవి విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ పద్మావతి ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ఆవరణలో చదువులతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయటం శుభ పరిణామన్నారు. ఈగ్రామంలో మంచి పనిచేయడానికి దాతలు ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేగేశ్న సుమన్, వేగేశ్న వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాల మేరకే పాలన



వేంద్రలో శ్మశానవాటిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు

పాలకోడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అవసరాలు తెలుసుకుని పాలన సాగిస్తున్నారని పాలకోడేరు మండలం పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) అన్నారు. పాలకోడేరు మండలం వేంద్ర గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.10. లక్షలు , పంచాయతీ నిధులు 3.10 లక్షలు మొత్తం రూ.13.10 లక్షలతో కలిపి నిర్మించిన బీసీ స్మశాన వాటిక షెడ్‌ను శనివారం ఎంపీపీ చంటిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడలి నాగేశ్వరి, ఎంపీటీసీ పాలా జ్యోతి, వేంద్ర అగ్రహారం సర్పంచ్ కడలి విజయలక్ష్మి, కొండేపూడి సర్పంచ్ చింతపల్లి వెంకటనారాయణ (చిన్నా) సానబోయిన వేణు, కే. రాంబాబు, దొరబాబు, సీతయ్య,వీరబాబు, పాలా శ్రీను, పాలా చిన్న కమిటీ సభ్యులు టీ. రామారావు, కె పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి

భీమవరం (ప్రకాశంచౌక్) : గ్యాస్ వినియోగదారులు గ్యాస్ వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఏఎస్‌ఓ ఎం.రవిశంకర్ అన్నారు. మారుతీటాకీస్ సెంటర్ సమీపంలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంలో హెచ్‌పీ గ్యాస్ గిఫ్ట్ దమాకా కార్యక్రమంలో బ్రోచర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా డీలర్ బీవీఆర్ మోహన్ గుప్త మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాలో ఈ గిఫ్ట్ దమాకా శ్రావణ మాసం నుంచి దీపావళి వరకూ నిర్వహిస్తామన్నారు. ముగింపు వేడుకలో డ్రా తీసి విజేతలకు విలువైన బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు

కాళ్ల: మండలంలో గ్రామాలాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు ఎంపీపీ పెనుమత్స శిరీష విశ్వనాథరాజు తెలిపారు. కాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శిరీష విశ్వనాథరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రభుత్వ శాఖాధికారులు మాట్లాడుతూ తన శాఖల ద్వారా అమలవుతున్న పథకాల తీరును గ్రామాల వారీగా వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీలు సరాబు పద్మ రాణి,మన్నే నాగలక్ష్మి, ఎంపీడీవో జి.స్వాతి, పెనుమత్స విశ్వనాథరాజు, మన్నే శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరూ అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణంరాజు

కాళ్ల: అందరూ అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని డా.వి.రామకృష్ణంరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరం మెయిన్ పాఠశాలలో కోపల్లె ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్ట్, అయోధ్య రామమందిర సలహాదారు ప్రొఫెసర్ వి.ఎస్ రాజు ప్రోత్సాహంతో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదివిన పాఠశాలకు తమవంతుగా ఎంతో కొంత చేయాలనే తాపత్రయంతో హైస్కూల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈతరగతులు కోసం ప్రత్యేక ఉపాధ్యాయుడ్ని నియమించి ప్రతి విద్యార్థిలోని ప్రతిభను మెరుగుపరుస్తామని ఆయన వెల్లడించారు. ఈఅవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 కనకరాజు, ఎం.రాంకుమారరాజు, కె.బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

సాక్షి, భీమవరం : స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని గునుపూడికి చెందిన వ్యక్తిపై దాడి కేసులో భూపతి వర్మపై కేసు నమోదుచేసినట్లు ఏఎస్సై రామచంద్రరావు చెప్పారు. వివరాల ప్రకారం గునుపూడి సీతమ్మసెంటర్‌కు చెందిన నెలపర్తి జాన్‌రాజుపై శుక్రవారం రాత్రి భూపతి వర్మ దాడిచేసి గాయపర్చాడు. స్థానికులు జాన్‌రాజును చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు భూపతివర్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చెప్పారు.

ఐటీఐ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడులో మిగిలిన పరిమిత సీట్లకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి ఐటీఐ జిల్లా కన్వీనర్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరాజు శనివారం తెలిపారు.ఈ కోర్సులో పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని ఆసక్తి కల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.ఇతర వివరాల కొరకు 08816 297093, 96760 99988 నంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



కాళ్లకూరు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పుష్ప రాజ్

కాళ్ల: యువత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్ప రాజ్ శనివారం ప్రకటనలో తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం కాళ్ల మండలం కాళ్ళకూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పుష్ప రాజ్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుకోవాలని కోరారు.ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వినియోగించుకుని ముందుకు వెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, ఉండి నియోజకవర్గం అధ్యక్షుడు చిగురుపాటి రాజేష్, కార్యదర్శి అలమూరి రాజశేఖర్, ఉండి మండల అధ్యక్షుడు తోర్లపాటి భాగ్యరాజ్ ,భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి నేతల సాల్మన్ రాజు ,రత్నం, యూత్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్అండ్‌డీ షోకేస్

సాక్షి, భీమవరం: స్థానిక విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆర్అండ్‌డీ షోకేస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో ఆర్అండ్‌డీ కీలకపాత్ర పోషిస్తుందని, ఇది టాలెంట్ హంట్ ఈవెంట్ పరిష్కారాన్ని చురుగ్గా ఆలోచించి ముందుకు తీసుకురావడానికి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల డీన్ ఎన్.పద్మావతి మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులకు ఆర్అండ్‌డీ షోకేస్ ద్వారా ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రదర్శన, పరిశోధన పత్ర ప్రదర్శన, మీ ఆలోచను పిచ్ చేయండి వంటి ఈవెంట్స్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె శ్రీనివాస్, కోకన్వీనర్ జి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

భీమవరం అర్బన్: రైతులు ఈ క్రాప్ తప్పకుండా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆయన శనివారం మాట్లాడారు. మండలంలో 7 వేల ఎకరాలలో సార్వా సాగుకు శ్రీకారం చుట్టారన్నారు. 2 వేల 500 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. మిగిలిన రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. సెప్టెంబర్ 15తో ఈ క్రాప్ నమోదు ముగుస్తుందన్నారు. ఈ క్రాప్ నమోదు వల్ల పంటల బీమా, ధాన్యం విక్రయం, రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలలో లబ్ధి చేకూరుతుందన్నారు. సార్వా సాగుకు సంబంధించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎన్ఆర్ కళాశాల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

వీరవాసరం: డీఎన్ఆర్ కళాశాల ప్రైవేటీకరణను నిలుపుదల చేయకపోతే ఆందోళన నిర్వహిస్తామని ఏపీ జన ప్రగతి సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల ప్రభాకర్‌రావు హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యనికి ముందే ఏర్పడిన డీఎన్ఆర్ కళాశాలలో ఎందరో విద్యాభ్యాసాన్ని పొంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. డీఎన్ఆర్ కాలేజీని ప్రైవేటుపరం చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు నాణ్యమైన ఉన్నత విద్య దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది బానిసత్వ సంకెళ్లలోకి వెళ్లిపోతారని, ప్రైవేట్‌పరం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం



తణుకులో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో వైఎస్సార్‌సీపీ నాయకుడు నత్తా భానువరప్రసాద్ నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ హైర్ బస్సులను శనివారం మంత్రి కారుమూరి ప్రారంభించి మాట్లాడారు. వేగం కన్నా ప్రాణం మిన్న అనే సూక్తిని పాటిస్తూ ప్రజలంతా ఆర్టీసీ బస్సులపైనే ప్రయాణం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ దాట్ల సుందరరామ రాజు, తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, కుడుపూడి చంద్రరావు పాల్గొన్నారు.